క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామి దర్గాలో ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాలలో అక్టోబర్ 3 నుంచి 14 వరకు నిర్వహించనున్న వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా గోపాలు, బచ్చు సుబ్రమణ్యం అన్నారు. గురువారం అమ్మవారిశాలలో ఉత్సవాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి

ప్యాపిలి: ప్రభుత్వం పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జలదుర్గం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, బోధన సామగ్రి కొనుగోలు హెచ్ఎంలకు భారంగా మారిందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు నెలలవుతున్నా నిధులు విడుదల చేయకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ చిన్నపరెడ్డి, ఎస్టీయూ నాయకులు హాజీ మస్తాన్‌వలి, చంద్రమౌళి, ఈశ్వర్‌యాదవ్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్ నాగమణి

డోన్: వెల్దుర్తి మండలం మదార్‌పురం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై కారు బోల్తాపడి తీవ్రంగా గాయపడిన ఆరేళ్ల మోక్షిత్ వైద్యానికి దాతలు రూ.1.63 లక్షలు అందజేశారు. దాతలల నుంచి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు సేకరించిన నగదును తహసీల్దార్ నాగమణి చేతులమీదుగా గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

అధికారులకు సన్మానం



కమిషనర్, సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: వినాయక చవితి ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికారులకు గురువారం గణేశ్ కేంద్ర ఉత్సవ సమితి సభ్యులు సన్మానం చేశారు. విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ మహబూబ్ వలీ, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, సిబ్బంది రమణ, గోపాల్, నాగన్న, రాజు, మధుమోహన్‌రెడ్డిలను ఉత్సవ సమితి సభ్యులు హరి, నాగ మోహన్, మురళీ, నాగేంద్రప్ప, వీరారెడ్డి, శ్రీనివాసులు, సతీష్ సన్మానించారు.

సత్కారం



ముకుందరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) మండల శాఖ నాయకులు ఘనంగా సన్మానించారు. పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్‌రఫీ, యనకండ్ల ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు విజయ, బత్తులూరుపాడు ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ముకుందరెడ్డిని ఆయా పాఠశాలల్లో పూలమాలు, శాలువాలతో నాయకులు సత్కరించారు. వారి సేవలను ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శి శ్రీపతి గుర్తు చేశారు. ఏపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులరెడ్డి, జిల్లా క్రీడా కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లతీష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు భయాందోళన చెందొద్దు

- తిమ్మరాజు కట్ట రివెట్‌మెంట్‌ను పరిశీలించిన ఎస్ఈ వర ప్రసాద్



కట్ట కింద నీటి లీకేజీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సార్బీసీ డివిజనల్ ఎస్ఈ వరప్రసాద్

అవుకు: మండల కేంద్రం అవుకు, చెర్లోపల్లె రహదారిలో ఉన్న తిమ్మరాజు చెరువు కట్ట రివెట్‌మెంట్ కుంగిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఎస్సార్బీసీ డివిజనల్ ఎస్ఈ వరప్రసాద్ కుంగిన కట్టతోపాటు కట్టకింద నీరు లీకేజీ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ ఇరవై ఏళ్ల కిందట అవుకు మూడు చెరువులను అనుసంధానం చేస్తూ అవుకు రిజర్వాయర్‌ను నిర్మించారని, తిమ్మరాజు చెరువు కట్ట పాత స్లూయిస్‌ను తీసేసి నూతన స్లూయిస్‌ను కట్ట చివర్లో ఏర్పాటు చేసామన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో(4.148 టీఎంసీ సామర్థ్యం) నీటిని నిల్వ ఉంచడంతో చెరువు కట్ట రాతికట్టడం (రివెట్‌మెంట్) కొద్దిమేరా కుంగిందని, అయితే ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. కుంగిన ప్రదేశంలో మట్టితో, గులకరాళ్లతో కప్పేసామన్నారు. రిజర్వాయర్‌లో నీటిని తగ్గించటానికి చర్యలు చేపట్టామన్నారు. జీఎన్ఎస్ఎస్, ఎస్సార్బీసీ కాలువల ద్వారా 6వేల క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తుంటే చెర్లోపల్లె సమీపంలోని గేట్ల ద్వారా గండికోటకు 12వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 4టీఎంసీల నీరు ఉందని, 3.5 టీఎంసీల వరకు తగ్గించి రివెట్‌మెంట్, నీటి లీకేజీ మరమ్మత్తుల పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో అవుకు ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు, డీఈఈలు, జేఈలు పాల్గొన్నారు.

నాలుగుకు చేరనున్న మద్యం దుకాణాలు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయనుంది. వీటికి సంబంధించి నూతన ఎక్సైజ్ పాలసీ రానుంది. ప్రస్తుతం మండలంలో కొలిమిగుండ్ల, బెలుం గుహలు, అంకిరెడ్డిపల్లెలో మద్యం దుకాణాలు ఉన్నాయి.ప్రభుత్వ తాజా నిర్ణయంతో దుకాణాల సంఖ్య నాలుగుకు చేరనుంది. కొత్తగా ఏర్పాటయ్యే మద్యం దుకాణా న్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనేది ఒకటి, రెండు రోజుల్లో విడుద లయ్యే నోటిఫికేషన్ ద్వా రా తెలుస్తుందని ఎక్సైజ్ అధికార వర్గాలు తెలిపా యి. దరఖాస్తు చేసుకునేందుకు రూ.2లక్షలుగా నిర్ణయించారు. లాటరీ పద్ధతిలోదుకాణాల నిర్వహ ణ ఎంపిక చేయనున్నా రు.మండలానికి మంజూరైన కొత్త మద్యం దుకాణం ఎక్కడ అయి ఉంటుందా అని ప్రజల్లో చర్చ జరుగుతుంది.

బుగ్గన ఫ్లెక్సీ చించేసినన దుండగులు



మాజీ మంత్రి బుగ్గన ఫ్లెక్సీని చించివేసిన దృశ్యం

డోన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఫ్లెక్సీని గుర్తు తెలియని దుండగులు చింపేశారు. శుక్రవారం బుగ్గన జన్మదినం. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు ఎస్‌బీహెచ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు బుధవారం రాత్రి చించేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ తదితరులు పోలీస్‌స్టేషన్‌తో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీని చించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా టీడీపీ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా శుక్రవారం డోన్‌కు వస్తుండటంతో ఆయన వర్గీయులు పెద్దఎత్తున స్వాగత సన్నాహాలు చేయడం.. ఆయనకు అదే పార్టీలోని వ్యతిరేక వర్గమైన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి వర్ధంతిని కోట్ల వర్గీయులు పెద్దఎత్తున చేసేందుకు సిద్ధమవుతుండటతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనే పరిస్థితులు ఉన్నాయని గ్రహించి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను రద్దు చేసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఐలమ్మ సేవలు చిరస్మరణీయం



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: వెట్టిచాకిరి, బానిస బతుకులు అనుభవిస్తూ మాన, ప్రాణాలు దక్కితే చాలనుకునే పరిస్థితుల్లో దొరలు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరవనిత చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఐలమ్మ 129 జయంతిని పురస్కరించుకుని గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటర్‌లోని స్మారక జీవీ కొండారెడ్డి గ్రంథాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు వెంకటరమణ, వాసు మాట్లాడుతూ ఆనాటి దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ఐలమ్మ వీరోచిత పోరాటం చేసిందన్నారు. ఆమె సేవలను గుర్తించి ప్రస్తుత తెలంగాణ సర్కార్ కోఠిలోని ఉన్నమహిళా కళాశాలకు ఐలమ్మ పేరును పెట్టడంతోపాటు ఆమె జయంతిని అధికారికంగా జరిపేలా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆంధ్రదప్రదేశ్‌లో ఐలమ్మకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, అంజనేయులు, చిన్న ఆంజనేయులు, హాజీవలి, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ యజమానుల దోపిడీని అరికట్టాలి

డోన్ టౌన్: వినోదం పేరుతో అభిమానులను దోచుకుంటున్న సినిమా థియేటర్ల దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు విజ్, రంగస్వామి గురువారం ఆర్డీఓ మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. 30 శాతం ధరలు పెంచుకోవచ్చని, సీటింగ్ కెపాసిటీకి తగ్గట్టు టిక్కెట్లు విక్రయించాలని నిబంధనలు ఉన్నా వాటిని అతిక్రమించి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, శుక్రవారం విడుదల కానున్న దేవర సినిమా సందర్భంగా థియేటర్లలో సోదాలు నిర్వహించాలని వారు ఆర్డీఓను కోరారు.

బ్యాటరీల అపహరణ

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీ సు స్టేషన్ పరిధిలోని పలుకూరు పెట్రోల్‌బంకు నందు ఈ నెల 24న అదే గ్రామానికి చెందిన ఎం సురేష్‌గౌడ్‌కు చెందిన ఆటో బ్యాటరీ, పక్కనే ఉన్న ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన్నట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య గురువారం తెలిపారు. సురేష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి



మదార్‌వలి(ఫైల్)

డోన్ టౌన్: దాడిలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మదార్‌వలి (23) గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ నెల 18న కొండపేటలో మదార్‌వలిపై అదే కాలనీకి చెందిన నలుగురు యువకులు దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన మదార్‌ను చికిత్స నిమ్మిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

శాంతియుత జీవనం గడపాలి



బలపాలపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ కక్షలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవనం గడపాలని సీఐ డీ. వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాలలో పోలీస్ సిబ్బందితో కలిసి సీఐ పుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరండా ఉండాలని, ముఖ్యంగా నాటుసారా, పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్‌టౌన్: చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, మండల గౌరవ అధక్షులు కోయిలకొండ నాగరాజు, అధ్యక్షులు నాగమద్దయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి పార్టీల తరఫున ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇవ్వకుండా వంద రోజుల పాలన సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



శిరీషకు చెక్కు అందజేస్తున్న ఎస్ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన శిరీషకు శ్రీ రామజనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మంజూరు చేసిన రూ.7లక్షల బీమా చెక్కును ఎస్ఐ దుగ్గిరెడ్డి గురువారం అందజేశారు. శ్రీరామ ఫైనాన్స్‌లో శిరీష భర్త పాండురంగడు ద్విచక్రవాహనం తీసుకున్నట్లు బ్రాంచ్ మేనేజర్ రఘురామిరెడ్డి తెలిపారు. పాండురంగడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో నిబంధల ప్రకారం భార్య శిరీషకు బీమా మొత్తం మంజూరైందని మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



చైర్మన్ రాజేష్‌ను సత్కరిస్తున్న కమిషనర్ ప్రసాద్‌గౌడ్

డోన్ : డోన్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా ప్రసాద్‌గౌడ్ గురువారం సాయిత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అసంపూర్ణంగా నిలిచి పోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని చైర్మన్ రాజేష్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కోరారు. ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది కమిషనర్‌ను సత్కరించారు.

నడిరోడ్డుపై గుంత..



ప్యాపిలి: పట్టణ సమీపంలోని ఎన్‌హెచ్ 44 నుంచి ప్యాపిలిలోకి వచ్చే వన్‌వేలో బనగానపల్లె క్రాస్ వద్ద రోడ్డు మధ్యలో అడుగులోతు గుంత ఏర్పడింది. రాత్రివేళల్లో గుంతను గుర్తించని వాహనదారులు అతివేగంతో వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. గాయాలతో బయట పడుతున్నారులే అనుకున్నారో ఏమో అధికారులు ఈ గుంతను పట్టించుకోవడం లేదు. ఇక అతివేగంతో వచ్చే వాహన చోదకులు, ఆర్టీసీ బస్సులు సైతం ఈ గుంతను తప్పించేందుకు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. ఇలా వెళ్లడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాన్ని ఢీ కొడితే మరింత పెద్ద ప్రమాదమే జరుగుతుంది. అయినా ఇవేమీ పట్టని వాహన చోదకులు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన తాలూరు చిన్న సుబ్బమ్మ నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం గురువారం తెలిపారు. ఆమె నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామ సమీపాన నంద్యాల రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆర్ కొత్తపల్లె గ్రామానికి చెందిన మనోహర్, కృష్ణ ద్విచక్రవాహనంపై నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. సిమెంట్ నగర్ గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. కృష్ణకు కాలు విరగగా, మనోహర్ కు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108 వాహనంలో బేతంచెర్ల ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

బేతంచెర్ల: ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం తగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి కార్మికులను బానిసలుగా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, మద్దిలేటి స్వామి, సంజీవుడు, రాజాబాబు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



డోన్ పట్టణంలోకి అక్రమంగా ఇసుకతో వస్తున్న ట్రాక్టర్

డోన్ : ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. టీడీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న నూతన ఇసుక పాలసీ విధానంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేదల గృహ నిర్మాణాలకు ఇసుకు అందని దాక్షగా మారింది. దీంతో గృహ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. పేద ప్రజలు గృహ నిర్మాణాలు సులువుగా చేసుకునేందుకు ఉచితంగా ఇసుకను అందిస్తామని గద్దెను ఎక్కిన టీడీపీ నేతలు ఇసుక సమస్యను పట్టించుకోవడం లేదు. కొందరు టీడీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. డోన్ నియోజకవర్గంలోని పలు వంకలు, వాగులలో ఇసుక టాక్టర్ల ద్వారా అక్రమార్కులు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలతోపాటు ఫిర్యాదులు స్వీకరించడానికి శుక్రవారం సాయిత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం పోగ్రాం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు 9959225795కు కాల్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.